318

# విప్లవ జ్వాల

## ANTI-FASCIST SONGS

318
OFFICE OF THE REGISTRAR OF BOOKS
22 FEB 1943
MADRAS
S/No 212
Acc No 6728

★

పట్టికొండ రంగయ్య

# విప్లవ జ్వాల

## ANTI-FASCIST SONGS

వట్టికొండ రంగయ్య

212
6728.

వీరులపాడు

కృష్ణాజిల్లా

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి

నవంబరు 1942

క్రాంతి ప్రెస్, తెనాలి.

OFFICE ... 22 FEB 1943 MADRAS

# అంకితము

ప్రియమిత్రుడు

కామ్రేడ్ 'చదలవాడ' కు

ఏనాడు మన భావ మేకీకృతంబయ్యె
ఏనాడు మన లక్ష్య మేకోన్ముఖం బయ్యె
ఏనాడు శ్రుతిగల్పి హృదయ తంత్రులు పాడె
ఏనాడు మన చైత ఏకైకలక్ష్యముగ
నవ నవోన్మిషితమై నవ్యకాంతులు గురిసె
ఆనాడె ఎడదలో అభిమాన వల్లికల్
మొలకెత్తి ముద్దుగా మెలమెల్ల పెంపారి
చివురించి, ననలెత్తి, పువు దావి గయిసేసి
అందాల చందాల నలరారు నీ నాడు:

ఈ వాసనా బలమొ? ఏ ప్రభావమొ? కాని
ఈ నాడు లోకాన ఏ దిక్కు కేగినా
పర జాతి పీడనా పరులైన ఫాసిస్టు
పాపిష్ఠ దుష్టులకు వ్యతిరేక భావాలు
ఎదలోన రేకెత్తి పదెపదే పులకించు;

ఆపుకోజాల కీ యావేశభర మేను
ఫాసిస్టు ప్రతికూల భావ బంధుర మైన

స్వాతంత్ర్య గీతికా ప్రసవ మొక టొకటిగా
జారవిడిచీ, నేడు సమకూర్చి ఒక చోట
నవ్యశిల్పము మీర కావ్యమాలిక నల్లి
ఆదర్శ సిద్ధికై అసమాన దీక్షతో
రేయిం బవలు గాఢ కృషి చేసి సాధించు
ఆంటి ఫాసిస్టువై అభ్యుదయ కవి వైన
నీ కాదరము తోడ నిర్మలినహృదయాబ్జ,
ఆంటి ఫాసిస్టునై అభ్యుదయ సత్కవిని
అస్మత్కృతి నిదే అర్పించుచున్నాడ
ఆర్ద్ర హృదయముతోడ అందుకో చెలికాడ

# పీఠిక

ప్రతి భావమూ బహిరంగం కావడానికి ప్రయత్నిస్తుంది. కొన్ని కొన్ని వేళలలో భావ పరంపర ప్రబలమై సిద్ధాంతముగా చివరకు తేలుతుంది. అవతల జీవిత లక్ష్యానికీ, జగత్కల్యాణానికీ సాధనభూత మనే స్పష్ట మార్గంలోకి ప్రవేశిస్తుంది. ఉద్రిక్త హృదయులకూ, ఉత్సాహవంతులకూ, ఉపదేష్టలకూ, కార్యవాదులకూ, క్రమక్రమంగా, ప్రచారక దృష్టి ప్రగాఢ మవుతుంది. స్వపరభేదములూ, ఇష్టానిష్టములూ, రాగ ద్వేషములూ, రాజకీయ విభేదాలూ రాక తప్పవు. పక్షములు బయలు దేరి ప్రచారము చేస్తవి స్వీయసిద్ధాంతాలను.

భరతఖండము వంటి బహు విశాల ప్రదేశములో వివిధ వర్గాలు వృద్ధి చెందటం సహజము. స్వాతంత్ర్యము కోల్పోయిన జాతిలో లక్ష్యభూత మైన సూక్ష్మసిద్ధాంతాలు నిగూఢంగానో నిర్నిద్రంగానో వ్యాప్తి చెందు తవి. భావ సమష్టి మేఘప్రాయమై అంతటా అలముకొని మిన్ను ముట్టు తుంది. యువతీ యువకులు, ఉత్సాహవంతులు, కవులు, గ్రంథకారులు, ప్రగల్భ వాక్కులు, పత్రికా జీవులు దాని ప్రాబల్యంలో పడిపోతారు. కవులముఖములు కట్టుబడిఉండవు. తరుణంలో తత్పరత్వముతో తమ సందేశాలతో వారు కావ్యముద్వారా సకలజనులను చకితులను చేస్తారు.

అయితే ఆంధ్రదేశంలో ఎన్నిక గన్న కవులు ఎందుచేతనో ప్రచా రకదృష్టితో పద్యంగాని పాటగాని చేయలేదు. ఆంధ్రపౌరుషాన్ని అభివర్ణించిన సత్కవులున్నారు. 'ఆకలి పాటలు' మాత్రం అస్మదాదులకు ఆనంద మిస్తున్నవి. నిష్కల్మష హృదయులూ, నిరుపమానదీక్షాపరతం త్రులూ, నిఖిలలోక కల్యాణనిష్ఠాపరులూ అయిన యువకులు కొందరు కొందరు ప్రచారార్థము పద్యములూ, పాటలూ బహుళముగా రచించారు. కాని అవి మావంటివారి మనస్సుల కెక్కలేదు. వాటిలో భావాలకు తగిన భాషగాని, చిత్తమునకు హత్తే శిల్పముగాని, మానసమును కరగించే మార్గం కాని చాలాస్వల్పము. నేను చూచినమట్టుకు ఇటువంటి వాఙ్మయంలో ఏదీ నచ్చిందని చెప్పడానికి శక్తిచాలదు.

ప్రకృతకవి సంస్కృతాంధ్రాలలో సరసమైన కృషి చేసి, మహాకవుల మార్గాలు గమనించి, చక్కని కవిత్వం చెప్పుతుండటం నాకు తెలుసును. ఇప్పుడు ప్రచారార్థము ఈయన ఈ గేయములు చెప్పినాడో, చెప్పిన గేయములు ప్రచారమునకు పనికి వస్తున్నవో చెప్పలేను. సత్య మున్నప్పటికీ శబ్దసౌష్ఠవముగాని, సరసమార్గముగాని, సరళరీతిగాని లేని రచన రమ్యము కాదు. ఈ కవి విధానములో రమణీయత గోచరిస్తున్నది. వాక్య కొంత హృదయంగమముగా ఉన్నది. కవితాకృషి ప్రయోజనాపేక్షతో చేసినా కమనీయముగా లేనిది ఉద్దిష్ట ఫలితాన్ని ఒసగ లేదు.

ఈ గేయ సందోహంలో ఐకమత్యమును గురించి, స్వాతంత్ర్యమును గురించి, శత్రువులను ఎదుర్కొనుటనుగురించి వివిధవిధాల ఉద్బోధమున్నది. జాతీయాభిమానము, స్వరాజ్యవాంఛ చాలా గాఢంగా కనపడుతున్నవి. పదప్రయోగాదులలో కొంతవరకు ఈకవి వ్యావహారికవిధానము ననుసరించినాడు. ప్రజారంజనమే ప్రధానోద్దేశ్యముగా కనుపిస్తుంది.

నాకు ఏజాతిమీదా ద్వేషంలేదు. అసలు ప్రభుత్వమే ఉండకూడదని నామతము. ప్రతిదేశములోనూ ప్రజలందరూ ధర్మమార్గంలో ప్రవర్తిస్తుంటే ప్రభుత్వంతో పనేముంటుంది? అటువంటి శుభోదయము ఏ కాలానికైనా కొళపోతుందా! ఒకజాతిని ఇంకొకజాతి పరిపాలించటం పనికిరాదు. ఒకదేశం అన్యదేశాన్ని ఆక్రమించటం అధర్మము. యుద్ధము అనర్థదాయకము. ఆశబ్దమే హరించి పోవాలి. అందరికీ కడుపార మృష్టాన్నములు, కట్టుకోటానికి వస్త్రాలు, ఉచితమైన విశ్రాంతి, ఉల్లాసక్రీడలు ఉండి తీరాలి. ధనముకన్న ధర్మానికే గౌరవ ముండాలి. పేదరికమూ, పీడా, ఆధివ్యాధులూ అంతరించాలి. సర్వే జనా స్సుఖినో భవంతు !

తల్లావఝ్ఝల శివ శంకర శాస్త్రి

సాహితీ సమితి
గుంటూరు

## సోదరా

ఒక వైపు ఫాసిస్టు
లొక వైపు ప్రజలంత
సర్వ శక్తులతోడ
జయము సంపాదింప
పోరాడుచున్నారురా
సోదరా
పోరాడుచున్నారురా

ప్రజల స్వాతంత్ర్య సం
పాదనార్థము నీవు
జనుల వైపున నిల్చి
జయము సాధించగా
ఫాసిజము నెదిరించరా
సోదరా
ఫాసిజము నెదిరించరా

ప్రజల రక్తము ద్రావు
ఫాసిస్టు జపనీలు
ఇపుడు మనపై దూకి
నిటు వచ్చుచున్నారు
శౌర్యమును చవిచూపరా
సోదరా
శౌర్యమును చవిచూపరా

గెల్చితే సత్కీర్తి
నిల్చు శాశ్వతముగా
ఓడితే పరదాస్య
పీడనము మన కింక
తర తరమ్ముల కుండురా
సోదరా
తర తరమ్ముల కుండురా

భరత భూమిని నీవు
పరులపా లొనరించి
పందవై పారితే
ముందుతరముల ప్రజలు
దుమ్మెత్తి పోస్తారురా
సోదరా
దుమ్మెత్తి పోస్తారురా

జపనీలు వచ్చుచో
స్వాతంత్ర్య మిత్తురని
పంచమాంగ దళాలు
భ్రమ పెట్టి ఊరించి
వంచించుచున్నారురా
సోదరా
వంచించుచున్నారురా



ఈ దుష్ప్రచారాల
కీ మాయమాటలకు
మోసపోవక యిట్టి
మోసగాండ్రను బట్టి
చాటించి వెలి వేయరా
సోదరా
చాటించి వెలివేయరా

ప్రజల మాడ్చు జపాను
ఫాసిస్టు ఘాతుకుల
పాలనకు లోనైతె
భూలోకనరకమని
ముమ్మాటికిని నమ్మరా
సోదరా
ముమ్మాటికిని నమ్మరా

ఫాసిస్టులను ద్రుంప
బద్ధకంకణు లౌచు
జనుల సేమమె గోరు
చైన రష్యా ప్రజల
ఆదర్శ మెద నిల్పరా
సోదరా
ఆదర్శ మెద నిల్పరా

వేదకాలము నాటి
వీర భారత కీర్తి
దిగ్దిగంతములందు
తేజరిల్లుచు నుండె
వెనుదిరిగి వీక్షించరా
సోదరా
వెనుదిరిగి వీక్షించరా

సర్వ దేశ ప్రజలు
సఖ్య భావముతోడ
భరత శౌర్యము గాంచ
వాంఛించుచున్నారు
కదన నైపుణి జూపరా
సోదరా
కదన నైపుణి జూపరా

జయము మనదే యంచు
జయ పతాకము నెత్తి
జయగీతములు పాడి
జయ జయ ధ్వనులతో
జయభేరి మ్రోగించరా
సోదరా
జయభేరి మ్రోగించరా

అక్టోబరు 42

## ఐక్య ప్రభావం

మనమంత ఒకటైతె మన కేమి లెక్క?
పదునాల్గు లోకాల నెదిరించ లేమ?

అయిదారు వత్సరా లాత్మరక్షణ కొరకు
చైనీయ సోదరుల్ జాతీయసేనతో
చచ్చినా బ్రతికినా జయమె లక్ష్య మటంచు
ఫాసిస్టుజపనీల పరిమార్చ లేద?
మనమంత ఒకటైతె మన కేమిలెక్క?
పదునాల్గు లోకాల నెదిరించలేమ?

పదునాల్గు రాజ్యాల బలముతో నాజీలు
పైబడ్డ నెదిరించి ప్రాణమానధనాలు
తృణముగా భావించు ఎర్రసైన్యము నేడు
ఫేసిస్టు కోరలన్ పెకలించ లేద?

మనమంత ఒకటైతె మన కేమిలెక్క?
పదునాల్గు లోకాల నెదిరించలేమ?

ఆక్రాంత రూసులో అసమాన శక్తితో
గోరిలా దళములూ క్రూర నాజీసేన
ముప్పుతిప్పలు పెట్టి మూడుచెరువుల నీళ్ళు
త్రాగించి, వేటాడి, తరిమేయ లేద?

మనమంత ఒకటైతే మన కేమిలెక్క?
పదునాల్గు లోకాల నెదిరించలేమ?

చైన రష్యాప్రజలు స్వార్థమునకే గాక
ప్రాపంచిక ప్రజల స్వాతంత్ర్యసిద్ధికై
వజ్ర సంకల్పులై ఫాసిస్టులను గూల్ప
ధర్మకంకణదీక్ష ధరియించలేద?

మనమంత ఒకటైతే మన కేమిలెక్క?
పదునాల్గు లోకాల నెదిరించలేమ?

భరత వీరులు మున్ను బహు యుద్ధములలోన
విజయమో? స్వర్గమో? వేరొండు లేదంచు
శత్రునాశ మొనర్చి సాంద్రకీర్తిద్యుతుల్
నలుదిక్కులను గూడ వెలయింపలేద?

మనమంత ఒకటైతే మన కేమిలెక్క?
పదునాల్గు లోకాల నెదిరించలేమ?



## స్వతంత్రయుద్ధం

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

అనాహారముగ అహోరాత్రములు
బాధలు పడుతూ పరులకు దాస్యము
చేసీ చేసీ చివికి కృశించిన
బానిస జాతుల బంధము లూడ్చే

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

కాయకష్టమును చేయుటె కానీ
కూటికి గుడ్డకు కొదువై కుందే
కూలీ రైతులు కోరే రాజ్య
స్థాపన కొరకై ద్వారము తెరచే

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

చిన్న దేశముల చీల్చుకు తింటూ
జనులకు దాస్యపు సంకెళ్లేస్తూ
బీదల పీలిచి పిప్పిగ జేసే
ఫాసిజభూతము భస్మ మొనర్చే

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

దరిద్ర దేవత తాండవ మాడే
ప్రపంచ మంతట ప్రజాప్రభుత్వం
సమస్త జనులకు శాంతిభద్రతలు
శాశ్వతసౌఖ్యం సంపాదించే

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

నిరంకుశత్వము నిర్మూలించే
కార్మికకర్షక నిర్మలహృదిలో
నిగూఢతరముగ నిబిడీకృతమా
ప్రచండశక్తిని ప్రకటింపించే

స్వతంత్రయుద్ధం స్వతంత్రయుద్ధం
స్వతంత్రయుద్ధం సాగింది

అక్టోబరు 42

## యువకుడా

రణభేరి మ్రోగింది రావోయ్
యువకుడా
రణరంగమున దూక రావోయ్

ఫాసిస్టు జపనీయ బడబానలజ్వాల
మలయు, బర్మా మ్రింగి మన భరత భూమికే
బంగాళఖాతాన పరుగెత్తి వస్తుంది
ప్రళయ రుద్రునిభంగి భక్షించ వలెనోయ్
రణభేరి మ్రోగింది రావోయ్
యువకుడా
రణరంగమునదూక రావోయ్

నాజీల దావాగ్ని నలువైపులకు ప్రాకి
పలు దేశములు కాల్చి వల్లకాడుగ మార్చి
కాకసను మీదుగా గంతేయ చూస్తుంది
శౌర్య వర్షము గురిసి చల్లార్చవలెనోయ్
రణభేరి మ్రోగింది రావోయ్
యువకుడా
రణరంగమున దూక రావోయ్

మనజాతి రక్తమాంసాలతో దుర్భేద్య
హిమవన్నగముకంటె ఎంతో బలీయమా
ప్రాకారపాళి మన భారతావని చుట్టు
నిరుపమానమ్ముగా నిర్మించవలెనోయ్

రణభేరి మ్రోగింది రావోయ్
యువకుడా
రణరంగమున దూక రావోయ్

మన ఐకమత్యమే మన ప్రజాస్వాతంత్ర్య
ధర్మహర్మ్యశ్రేణి నిర్మాణపు బునాది;
మన ఐకమత్యమే మానవ స్వాతంత్ర్య
శాంతిసుఖసంపదల్ సమకూర్చగలదోయ్

రణభేరి మ్రోగింది రావోయ్
యువకుడా
రణరంగమున దూక రావోయ్

అక్టోబరు 42

## ప్ర తి జ్ఞ

స్వాతంత్ర్య సమరమ్ము సాగించలేమ?
ఫాసిస్టు భూతాల పరిమార్చలేమ?

మత జాతి భేదాలు మంటలో గలిపేసి
ఐకమత్యము తోడ ఐకకంఠ్యము తోడ
హిందు ముస్లిము లంద రేకమై నడువంగ

స్వాతంత్ర్య సమరమ్ము సాగించలేమ?
ఫాసిస్టు భూతాల పరిమార్చలేమ?



అడుగడుగునకు కూడ అతి దుర్భరంబైన
ఆంక్ష బాధల నెన్నొ అనుభవించీ, విసిగి
నీచసేవా నిగళ మోచనం బొనరింప

స్వాతంత్ర్య సమరమ్ము సాగించలేమ?
ఫాసిస్టు భూతాల పరిమార్చలేమ?

అతిఘోర ఫాసిస్టు హత్యలకు గురియైన
ఆక్రాంత దేశాల ఆక్రందనధ్వనుల్
వినివినీ, క్రోధాగ్ని విశ్వరూపము దాల్చ

స్వాతంత్ర్య సమరమ్ము సాగించలేమ?
ఫాసిస్టుభూతాల పరిమార్చలేమ?

స్వాతంత్ర్యపరులైన సర్వదేశప్రజలు
ఆబాలగోపాల మన్ని జాతులుగూడ
అభ్యుదయ కాంక్షతో అండయై నిలువంగ

స్వాతంత్ర్య సమరమ్ము సాగించలేమ?
ఫాసిస్టు భూతాల పరిమార్చలేమ?

అక్టోబరు 42

## రక్తపతాకం

అదిగో! అదిగో!! అరుణపతాకం
ప్రపంచకార్మిక భాగ్యనిధానం
సుత్తీ కొడవలి సుచిహ్నదీప్తం
అదిగో! అదిగో!! అమృతపతాకం

కనబడలేదా కనులపండువుగ?
అరుణపతాకపు టడుగున నిలిచీ
నాజీరాక్షసి నాడి సడల్చుచు
జనుల స్వతంత్రత సంరక్షించే
ఎర్రసైన్య మదె ఎగురుచు పాడుచు
కనబడలేదా? కనబడలేదా?

వినబడలేదా వీనుల విందుగ?
అరుణపతాకపు టడుగున నిలిచీ
ఉద్ధృతసేనల నుద్బోధించే
సత్యవచస్కుడు శాంతమనస్కుడు
కామ్రేడ్ స్టాలిన్ గంభీరోక్తులు
వినబడలేదా? వినబడలేదా?

అగుపడలేదా అంబరవీధిని?
సంధ్యారాగ చ్ఛాయాసదృశం
ఫాసిజరాత్రి ప్రభాతతుల్యం
రష్యాకార్మిక రక్తస్నపితం
రష్యా బోల్షివిక్ రక్తపతాకం
అగుపడలేదా? అగుపడలేదా?
అదిగో! అదిగో!! అమరపతాకం

అక్టోబరు 42

## సోదరీ

శౌర్య సంపన్నలౌ
చైన రష్యా స్త్రీల
వీర గాథలు విన్నచో
సోదరీ
విస్మయము జనియించదా?

మాతృదేశము కొరకు
మగవారితో పాటు
పోరు సల్పుట చూచితే
సోదరీ
వీరత్వ ముప్పొంగదా?

అన్ని రంగాలలో
ఆరితేరీ వారు
పురుషులకు సరిదీటిగా
సోదరీ
ముందంజ వేయలేదా?

తమ దేశముల పైకి
దండయాత్రలు సేయు
ఫాసిష్టు పాపాత్ములన్
సోదరీ
భస్మ మొనరించలేదా?

వీర వనిత లటంచు
విశ్వ మంతట గూడ
రణ చాతురీ రీతిచే
సోదరీ
ప్రఖ్యాతి గాంచలేదా?

దేశభక్తి యటన్న
దివ్యౌషధము వారి
అణువణువులో జీర్ణమై
సోదరీ
ఐక్య మొనగూర్చలేదా?

అట్టి ఆదర్శమే
గట్టిగా మది నిల్పి
భరతభువి గాపాడగా
సోదరీ
ప్రతిన వేగమె బూనుమా



హంతకులు ఫాసిష్టు
లాక్రమించిన యెడల
భారతీయుల బాధలన్
సోదరీ
నోరు రాదు వచింపగా

అందులో ముఖ్యముగ
ఆడుజాతికి పట్టు
అనుపమాన దురంతముల్
సోదరీ
ఆత్మలో దలపోయుమా

కఠిన ఫాసిస్టు లా
క్రమిత దేశస్త్రీల
మానాభిమానమ్ములన్
సోదరీ
మంట గలిపేయ లేదా?

తల్లి ఏడ్చుచు నుండ
తన బిడ్డల వధించు
ఘోర హత్యలు చూచితే
సోదరీ
గుండె నీరయి పోవదా ?

ఈ యమానుషఘోర
కృత్యాలు భరతభువి
జరుగకుండుట కోసమై
సోదరీ
శత్రువుల నెదిరించుమా

భారతావనిలోని
వీరనారీశక్తి
చాటుటకునీ సమయమే
సోదరీ
గీటురాయని మెంచుమా

ఝాన్సిలక్ష్మిబాయి
చరితమ్ము స్మరియించి
పూర్వ మహిళౌన్నత్యమ్ము
సోదరీ
నిర్వహింప గడంగుమా

సంఖ్యా బలములోన
సమభాగ మగుటచే
సమముగా మగవారితో
సోదరీ
సమరభారము పూనుమా



అబల లంచను నామ
మర్థరహిత మొనర్చి
సమర నైపుణ్యమ్ముచే
సోదరీ
సబల లంచని చాటుమా

నవంబరు 42

## పార్టీ తత్వం

వ్రాతల చేతల బట్టే లోకం
పార్టీ తత్వం పరికిస్తుందోయ్!

“ఫాసిజమేమును ప్రతిఘటియిస్తాం
స్వరాజ్యమే మును సంపాదిస్తాం”

ఈలా ప్రజలకు హితవులు చెపుతూ
ఇంతకు బొంబే ఏ. ఐ. సీ. సీ.
తీరా వింటే తేల్చిన దేమిటి?
జాతీయైక్యత సాధ్యం కాదని
స్వరాజ్య మిస్తే స్వదేశరక్షణ
సాగిస్తా మని షరతువిధిస్తూ
కాదంటేమరి కలహం నిజమని
కాంగ్రెసు ప్రముఖులు గర్జిస్తుంటే